దీపావళి సందడి


పేటలోని రైతుబజారులో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో దీపావళి సందడి నెలకొంది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్స్, మార్కెట్ యార్డు, బలుసుపాడు రోడ్‌లో ఏర్పాటు దీపావళి మందుల దుకాణాలు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో దీపావళి పండుగను ఒకరోజు ముందుగానే నిర్వహించి, విద్యార్థులకు పండగ విశిష్టతను తెలియజేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా రోడ్డు కూడళ్లలో చిరువ్యాపారులు తోపుడుబండ్లపై ప్రమిదల విక్రయాలు చేపట్టగా, ప్రమిదలు కొనుగోలుకు మహిళలు ఆసక్తిచూపారు. పట్టణంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో 18దుకాణాలు, మార్కెట్ యార్డులో ఒకటి కలిపి మొత్తం పట్టణంలో 19షాపులకు అనుమతి ఇచ్చినట్లు తహశీల్దార్ సూర్యారావు తెలిపారు.

పాఠశాలల్లో..

పట్టణంలో పలు పాఠశాలల్లో దీపావళి పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో దీపాల మహోత్సవం జరిగింది. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి పండుగ విశిష్టతను వివరించారు. చెడుని మంచి జయించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆనందోత్సాలతో రకరకాల రంగులను వెదజల్లే మతాబులను కాలుస్తారని తెలిపారు.


కాకతీయ పాఠశాలలో నరకాసుర వధను నిర్వహిస్తున్న ఉపాధ్యాయిలు, విద్యార్థులు

విద్యార్థులతో కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు కాల్పించారు. విద్యార్థులు తయారుచేసిన నరకాసురుని బొమ్మను కాల్చి దీపావళి ఇతివృత్తాన్ని విద్యార్థులకు వివరించారు. బాణసంచా కాల్చే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వెలుగుల ఉత్సవం..దీపావళి

పెనుగంచిప్రోలు: అన్నివర్గాల ప్రజలు విశేషంగా జరుపుకునే పండుగ దీపావళి. నరకాసురుడిని సంహరించిన రోజును పురస్కరించుకుని చీకటిని పారద్రోలుతూ జరుపుకునే వెలుగుల ఉత్సవం. దీపావళి పండుగ చిన్నా, పెద్దా అందరూ కలిసి నిర్వహించుకునేది. దీపావళి పండుగను ఆదివారం ఉత్సాహంగా జరుపుకునేందుకు పెనుగంచిప్రోలు మండల ప్రజలంతా సిద్ధమవుతున్నారు. పెనుగంచిప్రోలులో 5 బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. నివాస గృహాలకు దూరంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో వివిధ రూపాల్లో, సైజుల్లో ప్రమిదలు విక్రయిస్తున్నారు.

నందిగామలో..

నందిగామ: పట్టణంలోని మధిర రహదారి పక్కనే గల అయ్య దేవర ట్రస్ట్ ప్రాంగణంలో శనివారం దీపావళి టపాసుల విక్రయ దుకాణాలు ప్రారంభమయ్యాయి.ఈ ఏడాది 14 దుకాణాలను మాత్రమే ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసు, ఫైర్ అధికారులు సూచించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ..

నందిగామ పట్టణంలోని పలు పాఠశాలలలో శనివారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాకతీయ అపోలో పాఠశాలలో లక్ష్మీ పూజ, నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో దీపాలంకరణలు చేశారు.

అమ్మ ఆకాంక్ష మేరకే సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు (నందిగామ టౌన్): రాజకీయాలలో ఉంటే ఎక్కువమందికి సేవ చేయవచ్చనే తమ మాతృమూర్తి కస్తాల మరియమ్మ ఆకాంక్ష మేరకే రాజకీయాల్లోకి వచ్చామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి సేవామార్గంలో నడుచుకుంటూ ఆమె ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని వారు వివరించారు. చందర్లపాడులో కస్తాల మరియమ్మ 10వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కుటుంబసభ్యులతో కలిసి మరియమ్మ సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సందర్భంగా జగన్‌మోహన్‌రావు, అరుణకుమార్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోను కనిపించలేదని చెప్పారు. పేదలకు అండగా ఉండాలి.. ఎల్లప్పుడూ మనకు చేతనైనంత సాయం చేయాలని అమ్మ ఎప్పుడూ చెబుతుండేవారని గుర్తు చేసుకున్నారు.

800 మందికి దుస్తుల పంపిణీ..

తమ మాతృమూర్తి మరియమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే జగన్‌మోహనారావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ 800మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.చిన్నతనం నుంచి అమ్మ చెప్పిన మాటలు మా కుటుంబసభ్యులకు ఇప్పటికీ స్ఫూర్తిని నింపుతాయని చెప్పారు. ఆమె ఆశయాల కనుగుణంగా నడుచుకోవటమే కాకుండా రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో శశికళ, సుజనీకుమారి, కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మరియమ్మకు నివాళులర్పించారు.


కస్తాల మరియమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

పాలకవర్గం నియామకానికి నోటిఫికేషన్ జారీ

తిరుమలగిరి(జగ్గయ్యపేట):మండలంలోని తిరుమలగిరి గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయశాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఏసీ శ్రీరామ వరప్రసాదరావు శనివారం తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా ఉండేందుకు ఆసక్తిగల వారు 20రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు పనివేళల్లో తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జగనన్నపై నమ్మకంతోనే వైఎస్సార్ సీపీలో చేరికలు

జగ్గయ్యపేట అర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసాతోనే పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పేట మండలం, బలుసుపాడు పంచాయతీ ఎనిమిదోవార్డు సభ్యుడు మల్లెల పిచ్చయ్య టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా ఉదయభాను, పిచ్చయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ, మాజీ ఉపసర్పంచ్ ఉప్పుతోళ్ల భూషయ్య, నాయకులు గుంజ హుస్సేన్ పాల్గొన్నారు.


మల్లెల పిచ్చయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

హైవేపై ప్రమాదాల నివారణే లక్ష్యం : డీసీపీ

నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ అజిత వేజెండ్ల తెలిపారు.నందిగామ ప్రాంతంలో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి రహదారిపై పలుచోట్ల జీబ్రా లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ఏసీపీ జనార్దన్‌నాయుడుతో కలిసి శనివారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీసీపీ అజిత మాట్లాడుతూ నిత్యం అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారిపై పలుచోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వాహనచోదకులు కూడా వేగ నియంత్రణ పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు నిర్లక్ష్య ధోరణి విడనాడి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ..

నందిగామలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను డీసీపీ అనిత శనివారం రాత్రి తనిఖీ చేశారు. దుకాణదారులకు తగు సూచనలిచ్చారు. ఆమె వెంట ఏసీపీ జనార్దన్ నాయుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కంచికచర్ల : ఈనెల 14వ తేదీ నుంచి 20వతేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలకు నేపథ్యంలో రూపొందించిన పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని, తొలుత మాజీప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తామన్నారు. 15న నేటి ఆధునిక సమాజంలో గ్రంథాలయాలు, వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 16న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై వకృత్వ పోటీలు, 17న క్విజ్ పోటీలు, 18న చిత్ర లేఖన పోటీలు, 19న దిశ చట్టంపై అవగాహన, 20న ముగింపు సభ ఉంటుందని వివరించారు. అందరూ పాల్గొని వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, జల్లి కారల్‌మార్క్స్, కే శ్రీనివాసరావు, బ్రహ్మాచారి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రుడు, స్థానికులు

కొణకంచిలో..

కొణకంచి(పెనుగంచిప్రోలు): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కొణకంచి ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు తెలిపారు.14న ప్రారంభ వేడుకలు, 15న పుస్తకప్రదర్శన, పుస్తకపఠన ప్రాముఖ్యత, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులు డా.ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్మరించుకోవడం, విద్యార్థులకు నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలుపై వకృత్వ పోటీలు, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, క్విజ్, రచయతల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, 19న దిశ చట్టం, మహిళాసాధికారతపై చర్చ, అవగాహన, ముగ్గుల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయంపై విద్యార్థులకు అవగాహన, సామూహిక పఠనం, వారోత్సవాల ముగింపు ఉంటుందని వివరంచారు.

ప్రతిభ చూపిన అమ్రితసాయి విద్యార్థులు

పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. చెన్నైకు చెందిన కొలబేరు డిజిటల్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు ఎంబీఏ, బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు మౌఖిక పరీక్ష, వ్రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 14మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3లక్షలు అందుతుందని వివరించారు. 2023–24విద్యా సంవత్సరంలో తమ కళాశాల నుంచి 161మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, వార్షిక వేతనం రూ.12లక్షల ప్యాకేజీని కూడా సాధించారని తెలిపారు. తమ కళాశాలలో నాణ్యమైన సాంకేతిక విద్యనందించడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా మెరుగైన విద్యను అందిస్తున్నామని వివరించారు. అనంతరంకళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కే రామ్మోహన్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వి.రామారావు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు కలిసి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, యాజమాన్యం, అధ్యాపకులు

క్లుప్తంగా

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జగ్గయ్యపేట, నందిగామ : దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి ఇంటా ఈ పండుగ వెలుగులు నింపాలని, ప్రజలంతా ఆనందోత్సాలతో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు



నందిగామ: నియోజకవర్గవ్యాప్తంగా శైవ క్షేత్రాల్లోని నవగ్రహ మండపాలకు శనివారం భక్తులు పోటెత్తారు.శనివారంతోపాటు అమావాస్య ముందు వచ్చిన శనిత్రయోదని, మాసశివరాత్రి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో నవగ్రహ మండపాలను దర్శించుకొని శనీశ్వరునికి తైలాభిషేకం చేశారు. శనీశ్వరునికి పూజలు నిర్వహిస్తే, సకల దోషాలు తొలగిపోతాయని, ముఖ్యంగా శని ప్రభావం పూర్తిగా తొలగి మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో నవగ్రహ మండపాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని నవ గ్రహ మండపంలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు శనికి తైలాభిషేకం కొనసాగింది. రామలింగేశ్వర నగర్‌లోని అయ్యప్ప ఆలయం, గాంధీనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, పల్లగిరి గట్టుపై గల నవగ్రహ మండపం, దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంతోపాటు ఆయా శివాలయాల్లోని నవగ్రహ మండపాల్లో శనికి తైలాభిషేకాలు జరిగాయి. మాస శివరాత్రి కావడంతో స్వామివార్లకు విశేష పూజలు చేశారు.

కీసర-గోకరాజుపల్లి రోడ్డుకు రూ.కోటి మంజూరు



కంచికచర్ల :మండలంలోని కీసర గ్రామం నుంచి గండేపల్లి, వీరులపాడు మండలం నందలూరు, తాటిగుమ్మి మీదుగా గోకరాజుపల్లి అడ్డరోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.1కోటి నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు పెద్దపెద్ద గోతులతో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ద్వారా రూ.కోటి రూపాయలు మంజూరు చేయించినట్లు చెప్పారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని వారు వివరించారు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ అధ్వాన్యంగా తయారయ్యాయని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో గ్రామాల్లోని అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడంతోపాటు డ్రైనేజీ వసతి కల్పిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పనులు పూర్తయిన కొన్ని సీసీరోడ్లను ఇప్పటికే ప్రారంభించామని, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా పనులను కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని చెప్పారు. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్లను కూడా అభివృద్ధి చేశామని వివరించారు. ఒకవైపు అర్హతే ప్రమాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తూనే, మరోవైపు నందిగామ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కోట్లాది రూపాయలతో పనులు చేపట్టినట్లు వారు వివరించారు.

ఆజాద్ జయంతికి తరలివెళ్లిన ముస్లింలు

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలకు జగ్గయ్యపేట నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు తరలివెళ్లారు. పేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి తరలివెళుతున్న వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో అబుల్‌కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుండటంపై వారు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమానికి జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రన్‌హుస్సేన్, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా, మత గురువులు, ముస్లిం సోదరులు తరలివెళ్లారు.


పేట నుంచి ఆజాద్ జయంతి వేడుకలకు విజయవాడ తరలివెళ్తున్న ముస్లింలు

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

వీరులపాడు: దీపావళి పండుగను జరుపుకునే క్రమంలో అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు సూచించారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచాను చిన్నపిల్లలకు దూరంగా ఉండేలా చూసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. బాణసంచా కాల్చే సమయంలో ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 1112నంబర్లతోపాటు స్థానిక పోలీసులు 9440796458, ఫైర్‌స్టేషన్ 08678 274444 ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు .

తక్కువ విస్తీర్ణం సాగుతో ఎక్కువ ఆదాయం

పెనుగంచిప్రోలు: రైతులు తక్కువ పొలంతో ఎక్కువ ఆదాయం వచ్చేందుకు పలు రకాల విత్తనాలు సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ జి.వన్నూరప్ప సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు స్థలంలోని అర ఎకరంలో ఏటీఎం(ఎనీ టైమ్ మనీ)మోడల్‌లో ఆకుకూరలు, కూరగాయలు, మునగ, డ్రాగన్ ఫ్రూట్ మొదలగు విత్తనాలు, మొక్కలు బీజామృతంతో శుద్ధి చేసి శనివారం నాటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మొక్కలు నాటుకుంటే ప్రతి రోజూ ఆకుకూరలు, కూరగాయలు అమ్ముకోవచ్చన్నారు. తద్వారా రోజూ రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వస్తుందన్నారు. అంటే నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల్లో రైతులు ఆసక్తి ఉంటే సంప్రదించాలని కోరారు. సూచనలు, సలహాలుతో పాటు శిక్షణ కూడా ఇస్తామన్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ రైతులు పొలంలో ఎక్కువ ఆదాయం పొందడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. భూమిలో పలు రకాల పంటలు సాగుచేస్తే జీవవైవిధ్యం కూడా పెరుగుతుందన్నారు. రైతులు ఈదిశగా ఆలోచన చేయాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పారుదలకు ప్రత్యేక చర్యలు

కంచికచర్ల : మండలంలోని గండేపల్లిలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపు పనులు చేపట్టారు. పారిశుద్ధ్య పనులను సర్పంచి బొక్కా రవికుమార్ శనివారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వాటిని తొలగించి మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ సహకారంతో గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేసేందుకు తగుచర్యలు తీసుకుంటున్నాని వివరించారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా రోడ్ల వెంబడి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని చెప్పారు. కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.